అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
శుక్రవారం 16 జూన్ 2023

ఘనంగా భట్టి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కాసిపేట

సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క 62వ జన్మదిన వేడుకలు గురువారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, సర్పంచ్ వేముల కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్ పంచి పెట్టారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ఇంత వయసులో కూడా తన ఆరోగ్య సమస్యలను లెక్క చేయకుండా రాష్ట్రంలో అవినీతి, అరాచక పాలనను అంతం చేయాలని పాదయాత్ర చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లా పిప్రిలో ప్రారంభించిన పాదయాత్ర 1000 కిలో మీటర్లు పూర్తి చేసుకుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పాటు కావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సిద్ధం తిరుపతి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి, మాజీ సర్పంచ్ కామెర శ్రీనివాస్, వార్డు సభ్యులు కొత్త రమేష్, పంబాల తిరుపతి, నాయకులు మల్లెత్తుల రాజేశం, జంపన్న, చారి, జాడి శివ, వెంకటేష్, ప్రేమ్, నవీన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు మృతి

నస్పూర్: రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు మృతి చెందిన ఘటన శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీఎం కార్యాలయం సమీపంలో 63 జాతీయ రహదారిపై జరిగింది. శ్రీరాంపూర్ ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం..మంచిర్యాల నుండి జైపూర్ వైపు సిమెంట్ లోడుతో వెళ్తున్న ట్రాక్టరు, గోదావరిఖని నుండి మందమర్రి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ఉన్న దర్శనాల రమేష్(45), సూర్యతేజ(14) అక్కడికక్కడే మృతి చెందారు. రమేష్ భార్య వెన్నెలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతునికి కూతురు ఉంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





కొనలేం..రాయలేం..!

- పెరిగిన పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌ల ధరలు
- ఎల్‌కేజీకి రూ.2వేలు..యూకేజీకి రూ.3వేలు
- ఆ పై తరగతుల కోసం మరింత వ్యయం
- ఆర్థిక భారంతో తల్లిదండ్రుల సతమతం

ఏటా జూన్ నెల వచ్చిందంటే తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలవుతుంది. ప్రతి నెలా వచ్చే వేతనంతో బతుకుబండి సాగిస్తున్న కుటుంబాలు.. జూన్ రాగానే వారి ఆర్థిక పరిస్థితి ఒక్కసారిగా తారుమారు అవుతుంటుంది. బడులు ప్రారంభమయ్యే ఈ నెలలో అధిక వ్యయం వెచ్చించాల్సి రావడం తల్లిదండ్రులకు ఇబ్బందికరంగా మారుతోంది. పిల్లలకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులు, దుస్తులు, పెన్నులు, పెన్సిళ్లు తదితర అన్ని రకాల వస్తువులు కొనుగోలు చేయాల్సి ఒటుంది. వీటి కోసం ఈ నెలలో రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీనికి తోడు ఈ ఏడాది పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర వస్తువుల ధరలు పెరగడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన మరింత అధికమవుతోంది. ఆర్థిక భారం కారణంగా కొనుగోలు చేయలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు. ప్రయివేటు పాఠశాలలతో పాటు సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకూ ఈ భారం తప్పడం లేదు.

ఆదిలాబాద్ పట్టణానికి చెందిన మహేష్ అనే వ్యక్తికి ఇద్దరు పిల్లలు. ఒకరు 9, మరోకరు పదో తరగతి చదువుతున్నారు. ఇద్దరికి కలిపి కేవలం నోటు పుస్తకాల కోసమే రూ.3వేలు ఖర్చు చేశారు. ఇంకా పాఠ్య పుస్తకాలు, బ్యాగులు కొనుగోలు చేయాల్సి ఉంది. తాజాగా పుస్తకాల ధరలు పెరగడంతో ఒక నెల వేతనం పిల్లల పుస్తకాలు కోసమే వెచ్చించాల్సి వస్తోందని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితి అనేక మంది తల్లిదండ్రులకు ఎదురవుతోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కరోనా సంక్షోభంతో ఆర్థికంగా చితికిపోయి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న జనాలపై ధరల భారం గుదిబండగా మారుతున్నాయి. ఓ వైపు నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటడంతో కొనలేక..తినలేని పరిస్థితి ఉండగా.. తాజాగా పిల్లలు చదువుకునే పుస్తకాల ధరలకు రెక్కలు రావడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థిక భారంతో తల్లడిల్లిపోతున్నాయి. కిందటేడాది కంటే ఈ సంవత్సరం పుస్తకాల ధరలు 40శాతం పెరగడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. చాలీచాలనీ వేతనాలతో జీవనం సాగిస్తున్న చిరుద్యోగులు, చిరు వర్తకులు, ఇతరాత్ర పనులు చేసుకొని జీవించే ప్రజలు నెల వేతనం కేవలం పుస్తకాలకే వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయివేటు బడుల్లో ఎల్‌కేజీకి పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు కొనుగోలు చేయాలంటే సుమారు రూ.2వేల వరకు ఖర్చు అవుతుండగా యూకేజీకి రూ.3వేలు, ఆ పై తరగతులకు రూ.4వేల నుంచి రూ.5వేల వరకు కేవలం పుస్తకాల కోసమే వెచ్చించాల్సి ఉంటుంది. ఇక సమరూప దుస్తులు, బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లు తదితర వాటి ఖర్చులు అదనంగా ఉంటున్నాయి. పేపర్ ధరలు పెరగడంతోనే ఈ సమస్య వచ్చినట్లు తెలుస్తోంది.

ఫీజుల భారంతోనూ సతమతం

పాఠ్య పుస్తకాలు, నోట పుస్తకాల కొనుగోలు కోసమే రూ.వేలు ఖర్చు చేస్తున్న తల్లిదండ్రులకు ఫీజుల భారం మరింత అవస్థలకు గురిచేస్తోంది. కొన్ని ప్రయివేటు పాఠశాలలు నాణ్యమైన విద్య పేరిట ఇష్టారీతిన రూ.వేలల్లో ఫీజులు వసూలు చేస్తుండటంతో ఆర్థికభారం పడుతోంది. అనేక మంది చిరుద్యోగులు, చిరువ్యాపారులు వారి పిల్లలను ప్రయివేటులో చదివిస్తున్నారు. ఆంగ్ల మాధ్యమంలో చదివించాలనే ఆకాంక్షతో ఆర్థిక భారం ఎదురవుతున్నా ప్రయివేటులో చదివించేందుకే మొగ్గుచూపుతున్నారు. ఇలాంటి వారికి ఏటా ఫీజుల భారం తప్పడం లేదు. మరోపక్క సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తోంది. కానీ నోటు పుస్తకాలు మాత్రం కొనుగోలు చేయాల్సి ఉంటుంది. సర్కారు బడిలో చదివేది ఎక్కువ మంది పేద పిల్లలే కావడంతో వీరికి ప్రభుత్వం ఉచితంగా నోటు పుస్తకాలు కూడా పంపిణీ చేస్తామని హామీనిచ్చింది. కానీ కార్యరూపం దాల్చడం లేదు. దీంతో నిరుపేద తల్లిదండ్రులు కూడా పిల్లలకు నోటు పుస్తకాల కోసం రూ.వేలు వెచ్చించాల్సి వస్తోంది. ఫలితంగా ఆర్థికభారంతో సతమతమవుతున్నారు.



సర్కారు బడులకు వచ్చిన పుస్తకాలు

ఫీజు నియంత్రణ కమిటీలుండాలి : పూసం సచిన్, టీఏవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు



ప్రయివేటు విద్యా సంస్థలు వ్యాపార ప్రయోజనాల కోసం తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయి. ఇష్టారీతిన ఫీజులు పెంచుతున్నాయి. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. ప్రతి పాఠశాలలో ఫీజు నియంత్రణ కమిటీలు ఏర్పాటుచేసి ఫీజుల వివరాలు బోర్డుపై ప్రదర్శించాలి. కానీ ఎక్కడా అమలు కావడం లేదు. ప్రభుత్వం వీటిపై దృష్టిసారించి ఫీజులను నియంత్రించాలి.

వరి కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-సారంగాపూర్

వరి కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు జామ్, యకర్‌పల్లె, కౌట్ల(బి) వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా రెండు రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేయలని నిర్వాహకులను ఆదేశించారు. మండలంలో 26 కొనుగోలు కేంద్రాలకుగాను 15 కేంద్రాల్లో కొనుగోళ్లుపూర్తి అయ్యాయన్నారు. ఆయన వెంట సివిల్ సప్లై డీఎం శ్రీకళ, తహశీల్దార్ సంతోష్‌రెడ్డి, ఆర్ఐ ముంతాజ్, రైతులు ఉన్నారు.

మాజీ జెడ్పీటీసీకి మాజీ మంత్రి గడ్డం వినోద్ పరామర్శ



నవతెలంగాణ -వేమనపల్లి

మండలంలోని ముల్కలపేట గ్రామంలో ఈ నెల 8న రాత్రి మాజీ జెడ్పీటీసీ తుమ్మిడి లచ్చయ్య ఇల్లు ప్రమాదవశాత్తు కాలిపోవడంతో తెలుసుకున్న మాజీ మంత్రి గడ్డం వినోద్ కుమార్ గురువారం లచ్చయ్య కుటుంబాన్ని పరామర్శించారు. రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కొత్త ఇల్లు మంజూరు చేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలలో అర్హులైన వాటిలో ప్రథమ అవకాశం వచ్చేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాబీర్ అలీ, మాజీ వైస్ ఎంపీపీ ఒడిల రాజన్న, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కుమ్మరి శ్రీనివాస్, మాజీ మార్కెట్ చైర్మన్ కారకూరి రాంచందర్, బెల్లంపల్లి మాజీ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, తోకల రాంచందర్, ఇగురం జగన్, ముల్కల సత్యనారాయణ, తాళ్ల వెంకటేష్‌గౌడ్, వేపూరి సత్యనారాయణ, కుబిడే కిష్టయ్య, నానేష్, చెన్నూరి కళ్యాణ్, మోర్ల రమేష్, ఎన్నం లింగయ్య, కామెర మల్లేష్, కోడూరి దుర్గయ్య, శౌకత్ అలీ, అబ్దుల్‌ఖాన్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల మరణాలు పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం



నవతెలంగాణ-నిర్మల్

బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు చనిపోతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిద్ర పోతోందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు వాగ్మారే మహేందర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో అమరుల స్తూపం వద్ద నిరసన తెలిపారు. ట్రిపుల్ ఐటీలో రెండు రోజుల క్రితం దీపిక ఘటన మరువక ముందే మరో విద్యార్థిని మృతి చెందడం అనుమానాలకు దారి తీస్తోందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఎందరో విద్యార్థులు తమ ప్రాణాలను అర్పించారని, స్వరాష్ట్రంలో బతుకులు బాగు పడుతాయనుకుంటే విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని, కనీసం జిల్లా మంత్రి ఐకే రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి స్పందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్, జిల్లా నాయకులు రాజారాం, వినోద్ పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

నేరడిగొండ : మండలంలోని వాంకిడి, బంధంరేగడ గ్రామాల్లోని విత్తన దుకాణాల్లో బోథ్ వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీధర్ స్వామి గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన విక్రయదారులు విత్తన చట్టానికి లోబడి విక్రయాలు చేపట్టాలని సూచించారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు పలు సూచనలు చేశారు. అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 50 నుండి 60 మిల్లీ మీటర్ల వర్షపాతం పడిన తర్వాత రైతులు విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. అయన వెంట మండల వ్యవసాయ అధికారి భాస్కర్ ఉన్నారు.

యూడీఐడీ కార్డుల తప్పనిసరి నిబంధనను విరమించుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కేంద్ర ప్రభుత్వ పథకాలు పొందేందుకు వికలాంగులకు యుడీఐడీ(యునిక్ డిజేబులిటీ గుర్తింపు కార్డు) తప్పనిసరి కలిగి ఉండాలనే నిబంధనను విరమించుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ముంజం ఆనంద్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వికలాంగుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు 2023-24 ఆర్థిక సంవత్సరం నుండి యుడిఐడీతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన వైకల్య ధృవీకరణ పత్రం, కేంద్రం జారీ చేసిన ప్రత్యేక వికలాంగుల గుర్తింపు సంఖ్య లేదా ఎన్‌రోల్‌మెంట్ నెంబర్‌ను తప్పనిసరి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోందని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. వికలాంగులందరికి వైకల్య ధృవీకరణ పత్రాలు లేవని, నిర్దిష్ట గడువు లోపు వైకల్య ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని, ఈ పత్రాలు లేకుండా యుడిఐడి కార్డులు మంజూరు చేయడం సాధ్యం కాదనే విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలని సూచించారు.

పట్టుకున్న పత్తి విత్తనాలను తిరిగి అమ్ముతున్నాడని
బెజ్జూరు ఎస్ఐపై డీఎస్పీకి ఫిర్యాదు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

బెజ్జూరు ఎస్ఐ వెంకటేశ్వర్లుపై గురువారం మండలానికి చెందిన కాంగ్రెస్, యాదవసంఘం నాయకులు, రైతులు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌కు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నాయకులు రావి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వీరు డీఎస్పీ కార్యాలయానికి చేరుకొని రెండు ఫిర్యాదులు అందించారు. గతేడాది పోలీసులు పట్టుకున్న గ్లైసిల్ విత్తనాలను ఐదు రోజుల తర్వాత ఎస్ఐ వెంకటేశ్వర్లు తనకు అమ్మాడని, ఈ ఏడాది కూడా తన వద్ద విత్తనాలు కొనాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు తన మీద ఒత్తిడి తేస్తున్నాడని మర్తిడి గ్రామానికి చెందిన జాజిమొగ్గ రవి ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఏడాది తాను కౌలుకు భూమి తీసుకోనందున విత్తనాలు కొనలేనని చెప్పడంతో దాన్ని మనసులో పెట్టుకున్న ఎస్ఐ తరచుగా తనను స్టేషన్‌కు పిలిపించి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పేర్కొన్నారు. తనింట్లో గ్లైసిల్ విత్తనాలు ఉన్నాయంటూ ఎస్ఐ వెంకటేశ్వర్లు వారం రోజుల క్రితం శుభకార్యం జరుగుతున్నా పట్టించుకోకుండా లోపలికి వచ్చి తనిఖీలు చేశాడని మండల కాంగ్రెస్ అధ్యక్షులు బూస శంకర్‌యాదవ్ మరో ఫిర్యాదును డీఎస్పీకి అందించారు. అధికారపార్టీ నాయకుల ఆదేశాల మేరకు తనను తరచుగా ఇబ్బందులకు గురి చేస్తున్న ఎస్ఐపై చర్య తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు రావి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు అండగా ఉండాల్సిన పోలీసులే ఇలాంటి అక్రమాలకు పాల్పడడడం సిగ్గుచేటని అన్నారు. తక్షణమే ఎస్ఐని సస్పెండ్ చేయాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ఎమ్మెల్యేలకు తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

సీఎం కేసీఆర్ సభలో పాల్గొనేందుకు గురువారం నాగ్‌పూర్‌కు వాహనంలో వెళ్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న కారుకు తృటిలో ప్రమాదం తప్పింది. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మాజీ ఎంపీ గోడం నగేష్, దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ వాహనంలో ప్రయాణిస్తుండగా బోరి వద్ద పశువు అడ్డు రావడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కారు ముందు భాగం స్వల్పంగా దెబ్బతింది. డ్రైవర్ మధు చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ ఒక్కసారిగా స్పీడ్ కంట్రోల్ చేసి, వాహనాన్ని పక్కన ఆపి ప్రమాదంలో ఎవరూ గాయపడకుండా అప్రమత్తమయ్యాడు. వాహనంలో ఇద్దరు ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీ ఉండడంతో ఘటనకు సంబంధించిన వార్త దావానంలా వ్యాపించింది. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రమాద విషయం తెలియడంతో ఎమ్మెల్యే యోగక్షేమాలను కనుక్కోవడంలో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర నుండి ఎమ్మెల్యే జోగు రామన్న వీడియో సందేశం పంపారు. బోరి వద్ద జరిగిన ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని, తాను క్షేమంగా ఉన్నానని పేర్కొన్నారు. అందరూ క్షేమంగా ఉన్నందున కార్యకర్తలు, అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

అక్రమంగా చెరువు మట్టి తరలింపు

నవతెలంగాణ-జైపూర్

మిట్టపల్లి గ్రామ పంచాయతీ శివారు పెద్ద చెరువు నుండి ఇటుకల తయారీ కోసం మట్టి అక్రమంగా తరలిపోతోంది. గుట్టుచప్పుడు కాకుండా మట్టిని అక్రమంగా తరలిస్తున్న క్రమంలో బుధవారం రాత్రి మట్టిని తరలిస్తున్న లారీ దిగబడటంతో విషయం వెలుగులోకి స్థానికులు పేర్కొంటున్నారు. రెండు రోజులుగా అర్ధరాత్రి దాటిన తర్వాత లారీల ద్వారా మట్టిని తరలిస్తున్నట్లు తెలుస్తోంది. మట్టిని తవ్వేందుకు ఏకంగా ప్రొక్లైనర్ వినియోగిస్తుండటంతో చెరువులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలకు దారి తీసే అవకాశం లేకపోలేదని శివారు రైతులు వాపోతున్నారు. స్థానికంగా ముదిగుంట సమీపంలో గల ఇటుక తయారీ కేంద్రంతో పాటు మంచిర్యాల పట్టణ పరిసరాల్లో గల ఇటుకల తయారీ కేంద్రాలకు మట్టి తరలిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. గతంలో చెరువు మట్టి తవ్వుకోవడానికి అనుమతి ఇవ్వాలని స్థానికులతో కలిసి కొందరు కోరినప్పటికీ శాఖ పరంగా ఎలాంటి అనుమతి ఇవ్వలేదని ఇరిగేషన్ ఏఈ శశాంక్‌రెడ్డి తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ మోహన్‌రెడ్డిని సంప్రదించగా మిట్టపల్లి చెరువు నుండి మట్టి తరలిస్తున్నట్లు సమాచారం లేదున్నారు. సంఘటనా స్థలాన్ని సందర్శించి మట్టి తవ్వకాలు నియంత్రించాలని రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌ను ఆదేశించామని పేర్కొన్నారు. మట్టి అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.



బాలిక అదృశ్య

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని శాంతినగర్‌కు చెందిన బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కౌట్ల(బి) శాంతినగర్‌కు చెందిన జాదవ్ బాబ్య కుమార్తె జాదవ్ సంగీత(20) డిగ్రీ చదువుతోంది. రెండు రోజుల క్రితం మీ సేవకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. చీకటి అయినా ఇంటికి రాలేదు. కుటుంబీకులు మీ సేవ కేంద్రానికి వెళ్లి చూస్తే లేకపోవడంతో బంధువుల ఇంట్లో వెతికారు. జాడ కనిపించకపోవడంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కారుణ్య నియామకాల కోసం ఇంటర్వ్యూలు



నవతెలంగాణ - రెబ్బెన

సింగరేణి ఉద్యోగం చేస్తూ మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల వారసులకు బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో గురువారం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. నలుగురు కారుణ్య నియామక అభ్యర్థులు హాజరయ్యారు. ఎస్ఓటు జీఎం కెహెచ్ఎన్ గుప్తా అభ్యర్థులను వారి కుటుంబీకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీవైసీఎంఓ ఆర్ శౌరి, పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు, డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

వయోధికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రపంచ వయోధికుల వేధింపుల అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం కాగజ్‌నగర్‌లో సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రాజీవ్ చౌక్‌లో ప్ల కార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ మాట్లాడుతూ వయోధికుల పోషణ బాధ్యత వారి సంతానానిదేనని అన్నారు. పెద్దలను గౌరవించాలని, వారి పట్ల ప్రేమగా ఉండాలని సూచించారు. వయోధికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌తో పాటు డివిజన్ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మురళీధర్‌రావు, అబ్దుల్ వాహబ్, కలికోట రమణయ్య, జయదేవ్, ఎల్లాగౌడ్, బి నర్సయ్య, అల్లి రాజయ్య, సుభాష్, దిలీప్ గౌడ్ పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థినికి సన్మానం



నవతెలంగాణ - కాసిపేట

మండల కేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తగరతిలో మండలంలోనే అధిక జీపీఏ సాధించిన విద్యార్థినిని దీక్షితతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ లతీఫ్‌ను ఘనంగా సన్మానించారు. మంచిర్యాలలోని పద్మావతి గార్డెన్‌లో సేవా భారతి ప్రతిభా పురస్కారాలలో భాగంగా అడిషనల్ కలెక్టర్ రాహుల్, డీఈవో యాదయ్య 9.2 జీపీఏ సాధించిన విద్యార్థినికి రూ.1000 నగదు రివార్డు అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఇంద్రాలదేవి విగ్రహ ప్రతిష్టాపన



నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలోని అకొండపేట్ ఇంద్రాలదేవి ఆలయాన్ని నిర్మించి గురువారం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ఎంతో నమ్మకమైన దేవతగా ఆరాధించే ఇంద్రాలదేవి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులే కాకుండా వివిధ గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు హాజరై తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వినోద్ నాయక్ అన్నదాన కార్యక్రమానికి తన వంతుగా క్వింటల్ బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

19న వనమహోత్సవం వేడుకలు

నవతెలంగాణ-జైపూర్

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న మండల పరిధిలో వనమహోత్సవం జరుపుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు కిష్టాపూర్ శివారు (సుందిళ్ల) పార్వతి బ్యారేజ్ పరిసరాలను గురువారం పరిశీలించారు. అదనపు డీఆర్‌డీఓ దత్తారావు, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఈ హరిత, శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ బాలయ్యతో కలిసి బ్యారేజ్ పరిసరాల్లో వనమహోత్సవం జరుపుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత మనమే తీసుకోవాలని జన శిక్షణ సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ రాజన్న తెలిపారు. గురువారం జీ20 కార్యక్రమంలో భాగంగా అటెండర్స్ కాలనీ మహిళలతో జన శిక్షణ సంస్థ సిబ్బంది సంతోష్, రాజులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కల పెంపకం వలన కలిగే లాభాలను వివరించారు. ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచర్ చైతన్య, మహిళలు పాల్గొన్నారు.

టూటౌన్ సీఐగా అశోక్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ టూటౌన్ సీఐగా ఎం.అశోక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ ట్రాఫిక్ సీఐగా ఉన్న అశోక్ ఇటీవల మల్టీ జోన్ సీఐల బదిలీల్లో టూటౌన్‌కు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని సీఐ పేర్కొన్నారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు.

మన పల్లెలు ప్రగతికి నిదర్శనం

- పల్లె ప్రగతితో మారిన గ్రామాల రూపురేఖలు
- ఎమ్మెల్యే అజ్మీరా రేఖా నాయక్



కడెంలో..



ఆదిలాబాద్ రూరల్



తలమడుగు : కజ్జర్లలో..

నవతెలంగాణ-కడెం

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పల్లెప్రగతి దినోత్సవాన్ని గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్మికులను సన్మానించి, కార్మికులకు సర్పంచ్‌లు ప్రశంస పత్రాన్ని అందజేశారు. అలాగే మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్, లింగాపూర్ గ్రామాల్లో నిర్వహించిన పల్లెప్రగతి దినోత్సవాలకు ఎమ్మెల్యే అజ్మీరా రేఖా శ్యామ్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన పల్లెలు దేశానికి ఆదర్శమని, పల్లెప్రగతితో గ్రామాల రూపురేఖలు మారాయని అన్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రవేశపెట్టే పథకాల వల్లే పల్లెలు ఇంత అందంగా అభివృద్ధి చెందాయని అన్నారు. అలాగే గ్రామాల్లో నర్సరీలు, పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేయడం వల్ల గ్రామాలకు పచ్చదనం కల వచ్చిందని అన్నారు. కేసీఆర్ తెలంగాణలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతోనే తెలంగాణ ప్రజలు అనుదినం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నారని అన్నారు. అలాగే ఖానాపూర్ నియోజకవర్గంలోని బీసీ కులస్తులు కేసీఆర్ ప్రవేశపెట్టిన లక్ష రూపాయల ఆర్థిక సాయానికి అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి ప్రతి గూడానికి ప్రతి తండకు రవాణా మార్గాలను సులభతరం చేశామని అన్నారు. ప్రజల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని అన్నారు. అనంతరం డీఆర్డీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంలో పల్లెలు ఎంతగానో అభివృద్ధి చెందాయని, ఈజీఎస్ ద్వారా పల్లెల రూపురేఖలు మారాయని అన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో పల్లెల అభివృద్ధికి ఎమ్మెల్యే అజ్మీర రేఖ శ్యామ్ నాయక్ ఎంతగానో సహకరిస్తున్నారని అన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో ఎమ్మెల్యే అజ్మీర రేఖా శ్యామ్ నాయక్, డీఆర్డీఓ విజయలక్ష్మిలను ఉపాధ్యాయ బృందం సన్మానించారు. ఈ కార్యక్రమంలో నచ్చన్ ఎల్లాపూర్ సర్పంచ్ బొడ్డు గంగన్న, ఆత్మ కమిటీ చైర్మెన్ కానూరు సతీష్, లింగాపూర్ సర్పంచ్ ఆకుల లచ్చన్న బాలవ్వ, తహసీల్దార్ చిన్నయ్య, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏపీఓ జయదేవ్, ఏపీఎం రాజారాం, ఈజీఎస్ సిబ్బంది, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్: మావల మండల కేంద్రంలోని వాఘాపూర్, మావల, బట్టి సవర్‌గాం గ్రామాల్లో పరిశుభ్రతగా ఉండటంలో పంచాయతీ పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని మావల ఎంపీపీ దర్శనాల సంగీత అన్నారు. గురువారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పల్లెప్రగతి దినోత్సవ కార్యక్రమాన్ని బట్టిసావర్‌గాం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్టీపర్పస్ వర్కర్లను శాలువాతో ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాగం గంగమ్మ, పంచాయతీ కార్యదర్శి కత్తి హేమలత, నాయకులు దర్శనాల ఏవన్, రాగం గోవర్ధన్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నార్నూర్:తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంతో పాటు, ఏంపల్లి, బేత్తల్‌గూడ, తాడిహత్నూర్ తదితర గ్రామ పంచాయతీ లో సర్పంచ్‌లు, కార్యదర్శులు జెండాను ఎగురవేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులను శాలువాతో ఘనంగా సన్మానించారు. వారి సేవలను గుర్తించి, ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ జాదవ్ శ్రీరాం నాయక్, నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, పీఏసీఎస్ ఇన్‌చార్జీ చైర్మెన్ సురేష్ ఆడే, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యునుస్ అక్బాని, ఫ్యాక్స్ డైరెక్టర్ కాంతారావు దుర్గే, సర్పంచ్‌లు, గోవింద్ రాథోడ్, సుజాత పరమేశ్వర్, రాథోడ్ మదుకర్, కార్యదర్శులు దినేష్, అనురాగ్, శ్రీనివాస్, కొల శేఖర్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్:దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కుంభఝరి గ్రామంలో గురవారం పల్లెప్రగతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఎంపీపీ గండ్రత్ రమేష్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలు గడిచిపోయి పదో సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం చేసిన ఘనత పల్లెప్రగతి ప్రతి గ్రామంలో అంగరంగ మా వైభవంగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఎంపీపీలకు, సర్పంచ్లకు, ఎంపీటీసీలకు, గ్రామంలో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్స్ పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందుబాయి రతన్, వార్డ్ మెంబర్ లాయర్ మధుకర్, ప్రవీణ్‌రెడ్డి, రామ్‌రెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



నార్నూర్

తలమడుగు:తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం కజ్జర్ల గ్రామంలో పల్లెప్రగతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెప్రగతి సందర్భంగా ఊరురా జెండా పండగ చేసుకోవాలని అన్నారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టాలని కోరారు. సీఎం కేసీఆర్ ఆదేశానుసారం ప్రతి గ్రామ పంచాయతీలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో అదేవిధంగా గ్రామ పంచాయతీలో ఉత్తమ సేవలందించిన వారికి సన్మానించి, ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తూ పల్లెప్రగతిలో గ్రామాల్లో ట్రాక్టర్లు, వైకుంఠ దామాలు, నర్సరీలు, ఇలా అనేక వసతులు కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని అన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, గ్రామ పెద్దలు చింతలపల్లి దేవారెడ్డి, మండల కన్వీనర్ వెంకటేష్, వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మగ్గిడి ప్రకాష్, ఉపసర్పంచ్ ప్రశాంత్, సత్యనారాయణ, దూస సంతోష్, మున్న, చందు, పల్లవి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుభీర్:మండల కేంద్రంతో పాటు పార్డి(బి) సోనారి, పల్సి, గోడపూర్ తదితర గ్రామంలో గురువారం గ్రామ పంచాయతీ కార్మికులకు స్థానిక సర్పంచ్‌ల ఆధ్వర్యంలో పల్లెప్రగతి కార్యక్రమంలో మండల నాయకులతో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని సర్పంచ్‌లు మాట్లాడారు. గ్రామంలో పని చేస్తున్న సపాయి కార్మికులు గ్రామంలో ఎప్పటికప్పుడు మురికి కాలువలు, రోడ్లు పల్లెప్రకృతి, డంపింగ్ యార్డ్‌లు శుభ్రం చేస్తున్నారని వారి సేవలు మరువలేనివని గుర్తు చేశారు. పని చేసిన వారికి ఎప్పుడు కూడా మారువకుండా వారికి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకునేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మీరా విజయ్ కుమార్, తూము పుష్పలత రాజేశ్వర్, నారాయణ, ఆనంద్ రావు పటేల్, దత్తురాం పటేల్, వైస్ ఎంపీపీ మోహియొద్దీన్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎన్నిల అనిల్, పీఏసీఎస్ చైర్మెన్ గంగాచరణ్ మాజీ జడ్పీటీసీ శంకర్ చవాన్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, కార్మికులు ఉన్నారు.

తాంసి:ఆదివాసీ పల్లెల్లో శుచి శుభ్రతను పాటిస్తూ జీవనం సాగించడంతో, పల్లెలు ప్రకృతికి నిలయాలుగా మారి అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. గురువారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం తాంసి మండలంలోని అంబుగాం గ్రామంలో నిర్వహించిన పల్లెప్రగతి కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మొదటి సారిగా గ్రామానికి వచ్చిన కలెక్టర్‌కు ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానికంగా ఉన్న కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాను ఎగురవేసి ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీ అంబుగాం గ్రామంలో చేసిన అభివృద్ధిపై వివరించారు. పల్లెప్రగతి పథంలో గ్రామాలు ముందుకు సాగుతూ అభివృద్ధిలో ఉన్నాయని అన్నారు. గ్రామస్తులు గ్రామంలోని సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని అంబుగాం గ్రామ పంచాయతీ నూతన పంచాయతీగా ఏర్పడినప్పటికి గ్రామానికి త్రీఫెజ్ కరెంట్, తాగునీటి సమస్య ఉందని తెలిపారు. మిషన్ భగీరథ నీరు అందక పోవడంతో ఎండాకాలం వచ్చిందంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. అదే విధంగా గ్రామానికి చెరువు పూడిక తీయక పోవడంతో 600 ఎకరాలు సాగుకు నోచుకోవడం లేదని వివరించారు. సమస్యలపై స్పందించిన కలెక్టర్ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తాగునీటి సమస్య లేకుండా సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తూర్పాభాయి యశ్వంత్, ఎంపీపీ మంజుల, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ ధనుంజయ్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ ఆకుల భూమయ్య, ఆదివాసీ తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు ఆత్రం భరత్, గ్రామ పటేల్ ఆత్రం మల్కు, మహాజన్ మెస్రం శంబాజీ, కుమ్రం కేశోరావు, గడ్డం భూమరెడ్డి, దుర్వ భీంరావు, మండల అధికారులు, ఆయా గ్రామ సర్పంచ్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ మండలం బాధనకుర్తి, చింతలపేట్ గ్రామాల మధ్య రూ. కోటి 20 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే రేఖా నాయక్ గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలోనే పల్లె పట్టణ రూపు రేఖలు మారుతున్నాయని అన్నారు. అనంతరం గ్రామ పల్లెప్రగతి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన పల్లె ప్రగతి కార్యక్రమంలో పాల్గొని, గతంలో ఉన్న పరిస్థితుల నుంచి ప్రస్తుతం జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు, నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రారంభమైన డ్రైవర్స్ శిక్షణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీఎస్ ఆర్టీసీ ఆదిలాబాద్ డిపోలో హెవీ మోటర్ వెహికల్ డ్రైవర్స్ శిక్షణ కొత్త బ్యాచ్‌ను గురువారం డిపో మేనేజర్ కల్పన ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు డిపో మేనేజర్ మాట్లాడుతూ ఆర్టీసీలో అనుభవం కలిగిన సిబ్బందితో శిక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. కొత్త బ్యాచ్‌లో ఏడుగురు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ విశ్వనాథ్, రాజేందర్, ఎఫ్డీఐ విష్ణు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

నవతెలంగాణ-నిర్మల్

పారదర్శకంగా ఓటరు జాబితాను రూపొందించుటకు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ స్రవంతి అన్నారు. గురువారం నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ జాబితాపై ఆర్డీఓ కార్యాలయంలో అఖిలపక్ష రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ద్వారా వచ్చిన జాబితాలో ఉన్నటువంటి ఆరు కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇంటిని తనిఖీ చేసి వాటిలో ఏవైనా ఇంటి నెంబర్‌లో మార్పులు ఉంటే సరిచేయాలని అన్నారు. అభ్యంతర ఫారం 6, 7, 8 వాటి గురించి తెలియజేశారు. ఎటువంటి తప్పులు, పొరపాట్లు లేకుండా పారదర్శకంగా తయారు చేయుటకు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. సమావేశంలో నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గ తహసీల్దార్లు ఎన్నికల సిబ్బంది, అఖిలపక్ష రాజకీయ పార్టీ ప్రతినిధుల పాల్గొన్నారు.

అటెండర్‌కు దేహశుద్ధి

నవతెలంగాణ-నేరడిగొండ

మహిళల పట్ల అసభ్యకర మెసేజ్‌లు, వాయిస్ రికార్డులు పంపుతూ వేధిస్తున్న అంటెర్‌కు గురువారం బాధిత మహిళలు దేహ శుద్ధి చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో కుల, ఆదాయ, ధృవీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న మహిళను కార్యాలయ అటెండర్ రాత్రి సమయంలో ఫోన్‌లో అసభ్యకర వాట్సాప్‌లతో, మెసేజ్‌లతో, వాయిస్ రికార్డులు చేస్తూ వేధించడంతో ఆ మహిళ కుటుంబీకులు అటెండర్‌కు దేహశుద్ధి చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. నేరడిగొండ మండల కేంద్రానికి చెందిన ఒక వివాహిత మహిళ ఇన్కం, క్యాస్ట్ సర్టిఫికెట్ కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా దరఖాస్తు ఫారంలో ఉన్న మహిళ ఫోన్ నెంబర్ తీసుకొని తహసీల్దార్ కార్యాలయానికి చెందిన అటెండర్ అశోక్ నేను తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది రవిని అంటూ అటెండర్ ఆ సదరు మహిళను బుధవారం రాత్రి ఫోన్‌లో అసభ్యకరమైన మెసేజ్‌లు పంపుతూ వేధిస్తున్నాడు. నీకు సర్టిఫికెట్ కావాలి అంటే నాతో మాట్లాడు లేదా నీ సర్టిఫికెట్స్, రేషన్ కార్డు మొత్తం రిజెక్ట్ చేస్తా అది నా చేతిలోని పని అంటూ ఆ మహిళలకు అసభ్యకర మెసేజ్‌లు చేయడంతో మహిళ కుటుంబీకులు గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి జూనియర్ అసిస్టెంట్ రవిని నిలదీయగా ఆ వాయిస్ నాది కాదు అనడంతో అటెండర్ స్వగ్రామానికి వెళ్లి అటెండర్ అశోకుని చెప్పుతో దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

అటవీ హక్కు పత్రాలు ఇవ్వకుండా మరోసారి మోసం

నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్

అటవీ హక్కు పత్రాలను ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం పోడు సాగుదారులను మరోసారి మోసం చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చిన్న లోకారి, పెద్దలోకారి, గ్రామాల్లో గడప గడపకు మన కాంగ్రెస్ అనే నినాదంతో విస్తృతంగా కాంగ్రెస్ పార్టీ ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తోంది. నాయకులు, కార్యకర్తలతో అందరితో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ధరణి అనే భూతం వచ్చి పెద్ద ఎత్తున రైతుల నుంచి భూములను లాక్కుని భూనిర్వాసితులను చేసిందని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు పహానిల ద్వారా పంట రుణాలు, పంట నష్టపరిహారం, వ్యవసాయ యంత్రాలు సబ్సిడీ ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. అనంతరం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత మాట్లాడుతూ చిన్న లోకారి, పెద్దలోకారి గ్రామాల్లో గత కాంగ్రెస్ పార్టీ హయాంలో ఇచ్చినటువంటి ఇందిరమ్మ ఇల్లు తప్ప ఈ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తానన్న డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కనిపించడం లేదని అన్నారు. ఎన్నికల హామీలను విస్మరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్. ఆదిలాబాద్ రూరల్ మండల అధ్యక్షులు దూబ సంజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్. జిల్లా ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు గెడం రవి, జిల్లా సేవాదళ్ చైర్మెన్ భేదోడ్కర్ మోతిరామ్, పట్టణ ప్రధాన కార్యదర్శి సాదిక్‌బాయ్, మాజీ కౌన్సిలర్ ముర్తుజా, మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వసీం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో ఆవు మృత్యువాత

నవతెలంగాణ-కుభీర్

విద్యుద్ఘాతంతో ఆవు మృత్యువాత పడ్డ సంఘటన గురువారం మండలంలోని పార్డి(బి) గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్డి(బి) రాజరాజేశ్వర ఆలయానికి చెందిన ఆవు గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగేదని పేర్కొన్నారు. దీంతో గురువారం ఉదయం సమయంలో గ్రామంలో తిరుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు ఓ ఇంటి వద్ద పొదలో మేత మేస్తుండగా విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో చుట్టూ పక్కల వారు గమనించి వెంటనే కర్రతో కొట్టిన ఫలితం లేకుండా పోయింది. విద్యుత్ అధికారులకు, పశువైద్యాధికారికి సమాచారం అందించి, పంచనామా నిర్వహించి నష్ట పరిహారం అందేలా చూస్తామని అధికారులు తెలిపారు. దీని విలువ సుమారు రూ.30వేలకు పైగా ఉంటుందని, గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రాజరాజేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆవుకు అంత్యక్రియలు నిర్వహించారు.

డ్రైనేజీలో పడి వృద్ధుడి దుర్మరణం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

డ్రైనేజీలో పడి వృద్ధుడు దుర్మరణం చెందిన సంఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎర్రవోయిన పోతన్న(79) గ్రామంలో తిరుగుతూ యాచిస్తు జీవనాన్ని గడుపుతున్నాడు. ఈ క్రమంలో మండలకేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని డ్రైనేజీలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే..!

- ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్టు



నవతెలంగాణ-నిర్మల్

బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలేనని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శీతల్కర్ అరవింద్ అన్నారు. గురువారం మృతురాలు కుటుంబ సభ్యులని పరామర్శించేందుకు వెళ్లగా, పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బాసర ట్రిపుల్ ఐటీలో రెండు రోజుల కింద దీపిక ఘటన మరువకముందే మరో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడటం దారుణమని అన్నారు. ఆత్మహత్యపై అనేక అనుమానాలకు దారితీస్తున్నాయని అన్నారు. అసలు బాసర ట్రిపుల్ ఐటీలో బడుగు, బలహీన, పేద విద్యార్థులు చదువుకోవడానికి వస్తే అక్కడున్న అధికారుల్లో ఆత్మహత్య చేసే విధంగా తరగతులు చెబుతున్నారని ప్రశ్నించారు. గత కొన్ని నెలల కింద మంత్రి కేటీఆర్ వచ్చి బాసర ట్రిపుల్ ఐటీ యూనివర్సిటీ రూపురేఖలు మారుస్తామని అన్నారని అన్నారు. ఎటువంటి సమస్యలు ఉండవని, కానీ ఎక్కడ సమస్యలు అక్కడనే ఉన్నాయని అన్నారు. 12 డిమాండ్లతో విద్యార్థులు ఉద్యమిస్తే ఏ ఒక్క డిమాండ్ కూడా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. 300 అధ్యాపకులతో బోధించాలి కానీ బాసర ట్రిపుల్ ఐటీ ఉన్న అధికారులు 190 అధ్యాపకులతో బోధించడం జరుగుతుందని అన్నారు. సరైన భోజనాలు పెట్టడం లేదన్నారు. ఇంత జరుగుతున్నా కూడా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని అన్నారు. స్థానిక మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శమని విమర్శించారు. వెంటనే లిఖిత, దీపికా కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నవీన్, సభ్యులు పాల్గొన్నారు.

నిర్మల్:నిర్మల్ జిల్లా ప్రభుత్వాస్పత్రి వద్ద గురువారం ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. బాసర ట్రిపుల్ ఐటీలో నాల్గవ అంతస్తు నుంచి పడి మృతి చెందిన లిఖిత మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగ, చూసేందుకు వచ్చిన బీజేపీ, యువ మోర్చా, ఎస్ఎఫ్ఐ, కాంగ్రెస్ ఇతర సంఘాల నాయకులను గురువారం పోలీసులు అడ్డుకున్నారు. ఆస్పత్రిలోనికి వెళ్లేందుకు నాయకులు ప్రయత్నించారు. దీంతో పోలీసులతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఇంద్రకరణ్‌రెడ్డి, ఇన్‌చార్జీ వీసీ వెంకటరమణను దీనికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వారు పేర్కొన్నారు. ఆస్పత్రిలోని వెళ్లెందుకు ప్రయత్నించిన ఆందోళన కారులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన విద్యార్థినుల కుటుంబాలకు న్యాయం చేసి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా విద్యార్థి సంఘాలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ఖానాపూర్:విద్యార్థినుల ఆత్మహత్యలపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని లంబాడా హక్కుల పోరాట సమితి నిర్మల్ జిల్లా అధ్యక్షులు బాణావత్ గోవింద నాయక్ అన్నారు. గురవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో మొన్న దీపిక, నిన్న లికిత, అనే విద్యార్థినులు ఆత్మహత్య చేసుకోవడం ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. విద్యార్థులు మానసిక బలహీనతకు లోను కాకుండా ఎలాంటి కఠోర పరిస్థితులు ఎదురైనా ఆత్మస్థైర్యంతో ఎదుర్కొనే ధైర్యాన్ని ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సంస్థలో జరుగుతున్న లొసుగులను సరి చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సూచనలను సలహాలను పరిగణలోకి తీసుకొని ప్రక్షాళన చేయాల్సిన అవసరం యాజమాన్యంపై ఉందని అన్నారు. బాధ్యులు ఎవరైనా ఎంతటి వారైనా వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థుల మరణాలకు పులిస్టాప్ పెట్టే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్త జీపు జాతా

- 16న జిల్లాలో బహిరంగ సభ

నవతెలంగాణ-నిర్మల్

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరానికై రాష్ట్ర వ్యాప్త జీపుజాత, బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు, సభను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి బొమ్మెన సురేష్, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజమణి అన్నారు. జిల్లా కమిటీ సమావేశం సీఐటీయూ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్ కేటాయించాలని అన్నారు. అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే జీపుజాత నిర్మల్ జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్ స్టేడియం బహిరంగ సభ నిర్వహించబోతున్నామని అన్నారు. ఈ సభను అంగన్‌వాడీ యూనియన్ టీచర్లు, ఆయాలు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. జూన్ 16న ఆదిలాబాద్‌లో జీపుజాత ప్రారంభమవుతుందని అన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్ర జీపుజాత జిల్లాకు వస్తుందని అన్నారు. అనంతరం బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడి యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు శైలజ, విజయ, కార్యదర్శి బి.లలిత పాల్గొన్నారు.



అనుదినం జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 16 జూన్ 2023

ఘనంగా భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-జన్నారం

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను గురువారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు బోర్లాకుంట ప్రభుదాస్, మాట్లాడుతు భట్టి విక్రమార్క పాదయాత్ర ద్వారా కాంగ్రెస్ పార్టీకీ మరింత బలం పెరిగిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమములో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పసి ఉల్లా, జిల్లా కార్యదర్శి ముత్యం రాజన్న, పట్టణ అధ్యక్షుడు దుమల్ల రమేష్, ఎంపీటీసీ మమతా కరుణకార్, కార్యదర్శి బానోవాత్ తిరుపతి, ఎస్సీ సెల్ మామిడిపెల్లి ఇందయ్య, పొనకల్ వార్డ్ మెంబర్ గంగన్న, యూత్ కాంగ్రెస్ నాయకులు ఇమ్రాన్ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి హేమంత్‌చారి, దుమల్ల ప్రశాంత్ పాల్గొన్నారు.

బీటెక్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-రెబ్బెన

మంథని జేఎన్‌సీయూహెచ్‌లో రిజర్వేషన్ కోటాలో బీటెక్ 2023-24 ప్రవేశాల కోసం సింగరేణి ఉద్యోగుల పిల్లల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు బెల్లంపల్లి ఏరియా జీఎం జి.దేవేందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎగ్జీక్యూటివ్ పిల్లలకు 18 సీట్లు, ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగుల పిల్లలకు 18 సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. ఎంసెట్ క్వాలీఫై అయిన విద్యార్థులు ఎంసెట్ ర్యాంకు కార్డు, ఉద్యోగి ఒరిజినల్ కంపెనీ గుర్తింపు కార్డు, కులం సర్టిఫికేట్, లోకల్, నాన్‌లోకల్ సర్టిఫికేట్‌తో పాటు జూలై 10వ తేదీలోపు జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. వీటితో పాటు యూనివర్సిటీ కళాశాల ఆఫ్ ఇంజనీరింగ్(కేయు), కొత్తగూడెం కళాశాలలో బీటెక్ మైనింగ్ కోర్సులో రెండు సీట్లు, టీఎస్‌ఈ రెండు సీట్లు, ఐటీలో రెండు సీట్లు, ట్రిబుల్ ఈలో రెండు సీట్లు, ఈసీఈ రెండు సీట్లు భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు.

బీసీలకు బీసీబంధుతో రూ.10లక్షలు ఆర్థిక సాయం అందజేయాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్, మందమర్రి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు బిసిబంధుతో రూ.10 లక్షల ఆర్థిక సాయం అందజేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కదార్ జీవన్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9 సంవత్సరాలు పూర్తి చేసుకొని పదో సంవత్సరంలో అడుగుపెడుతున్నప్పటికీ బీసీలకు సమన్యాయం జరగలేదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో బీసీ కార్పొరేషన్ తొమ్మిది లక్షల దరఖాస్తు ఉన్నప్పటికీ ఇప్పటికీ బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 60 శాతం బీసీల కులాల వారు చాలా ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని ఇప్పటికీ కూడా రోజువారి కూలీలుగా, వ్యవసాయ రంగంలో, కుల వృత్తుల పైన ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన కులవృత్తుల వారికి రూ. లక్ష ఆర్థిక సాయం కేవలం 15 కులాలకు మాత్రమే పరిమితం చేయడం చాలా బాధాకరమని అన్నారు. రూ.లక్ష తోనే బీసీల జీవితాలు మారవని, దళిత మిత్రులకు ఎలాగైతే దళిత బంధువు ప్రవేశపెట్టారో రాష్ట్ర ప్రభుత్వం బీసీ బందు ప్రవేశ పెట్టి ప్రతి అర్హుడైన బీసీకి రూ.10 లక్షలు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిల్‌పేట మాజీ సర్పంచ్ తిరుపతి, పట్టణ ప్రధాన కార్యదర్శి అంకం రాజ్ కుమార్, మండల నాయకులు, మాస్ సంతోష్, రామంచ రాములు, మాజీ సర్పంచ్ నంబయ్య హనుమంతు, ఓడనాల బాబు, కొండపర్తి మధుకర్, రాగుల రాజు, మైపాల్, సంతోష్, రాజు, పోషం, రవి పాల్గొన్నారు.



నేరాల నిర్మూలనకు కార్డెన్‌సర్చ్

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

నేరాల నిర్మూలనకు ప్రజల రక్షణ, భద్రత కోసం పోలీసుల కమ్యూనిటి కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం రామకృష్ణపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొక్కల గుట్ట గ్రామంలో ఆర్‌కేపీ పట్టణ ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో 20 మంది పోలీసు సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త వ్యక్తులు, నేరస్తులు షెల్టర్ తీసుకుని ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువత చెడు అలవాట్లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని లేదా 100 నెంబర్‌కి కాల్ చేయాలని, సైబర్ నేరాల మోసగాళ్ల ఫోన్ కాల్స్ మెసెజ్‌లకు స్పందించవద్దని సూచించారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలు నడిపే టప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని డ్రైవింగ్ లైసెన్స్ అందరు కలిగి ఉండాలని తెలిపారు. అలాగే గ్రామాలలో స్వీయ రక్షణ కొరకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని భద్రతా పరమైన అంశాలలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాసిపేట్ ఎస్సై గంగారాం, దేవాపూర్ ఎస్సై అంజనేయులు, సర్పంచ్ బోలిశెట్టి సువర్ణ, పంచాయతీ సెక్రటరీ విద్యాలత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి

- మనస్తాపంతో తండ్రి బలవన్మరణం
- కుటుంబంలో విషాదం



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని తమేళ గ్రామానికి చెందిన వసాకె తులసీరాం(25) జైత్‌పూర్ గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదంలో గురువారం మృతి చెందాడు. కుమారుడు మరణించాడనే విషయాన్ని జీర్ణించుకోలేక తండ్రి వసాకె భీంరావు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఉదయమే నూతన గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ కార్యక్రమానికి హాజరై అంతలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామస్తులతో పాటు కుటుంబంలో విషాదం నింపింది. ఒకేసారి కుటుంబంలో ఇద్దరు మరణించడంతో దిక్కులేని పరిస్థితి ఏర్పడింది. బుధవారం తులసీరాంకు ఎంగేజ్‌మెంట్ జరిగిన తెల్లారే సరికి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. దీంతో పెళ్లికి ముందు ఇలాంటి సంఘటన జరగడంతో రెండు కుటుంబాల్లో విషాధఛాయలు నెలకొన్నాయి. గ్రామస్తులు ఆ కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్తులు, కుటుంబసభ్యులు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. రోడ్డు ప్రమాదం జరిగిన ఘటన స్థలానికి స్థానిక పోలీసులు చేరుకొని తులసీరాం మృతదేహానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం చేసేందుకు తరళించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ తెలిపారు.

జీపీ భవన నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతగూడ, చింతలపల్లి గ్రామలలో నూతనంగా గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే రేఖానాయక్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తాండాలను, గూడాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి గ్రామానికి గ్రామపంచాయతీ కార్యాలయం ఉండే విధంగా ప్రత్యేక నిధులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, చైర్మన్ నాసాని రాజన్న, ఆ గ్రామ సర్పంచ్, జ్యోతి శిరీష్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్ పాల్గొన్నారు.

తెలంగాణ పల్లెలు దేశానికే ఆదర్శం

- పల్లె ప్రగతి దినోత్సవంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పల్లెల స్వయం సమృద్ధిలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని అసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పునరుద్ఘాటించారు. మండలంలోని అప్పపెల్లి గోవిందాపూర్ గ్రామాల్లో నిర్వహించిన పల్లె ప్రగతి దినోత్సవ వేడుకల్లో నాయకులతో కలిసి జెండా ఆవిష్కరించి ఆయా గ్రామపంచాయతీలో పంచాయతీ భవనాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంతో పోలిస్తే పల్లెలు ఎంతగానో ప్రగతి సాధించాయన్నారు. తక్కువ జనాభాతో గ్రామపంచాయతీలుగా ఏర్పడడమే కాకుండా పచ్చదనం పారిశుధ్యానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని తెలిపారు. త్వరలోనే ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడానికి పంచాయతీరాజ్ చట్టాన్ని కూడా తీసుకురావడం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ వైస్ ఎంపీపీ సుంకరి మంగ పెంటయ్య, ఎంపీడీఓ శశికళ, ఎంపీఓ ప్రసాద్, అప్పపెల్లి సర్పంచ్ బాబురావు పాల్గొన్నారు.

ఈదులవాడ గ్రామపంచాయతీలో

ఈదులవాడ గ్రామపంచాయతీలో సర్పంచ్ భీమేష్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించి ప్రకృతి వనం వద్ద వేడుకలు నిర్వహించారు.



రెబ్బెనలో..

రెబ్బెన : మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో పల్లె ప్రగతి దినోత్సవం సందర్భంగా గురువారం ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్‌రావు జెండా ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పల్లె ప్రగతి కార్యక్రమంలో ప్రతి గ్రామం రూపురేఖలు మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మారుమూల గ్రామాలకు ప్రతి గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు, చెత్త సేకరణకు ట్రాక్టర్లు, ట్రాలీలు, హరితహారం కోసం ట్యాంకర్లు, నర్సరీలు, అందేవిధంగా వైకుంఠదామం, డంపింగ్‌యార్డులు, పల్లె ప్రకృతివనాలు ఏర్పాటుచేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్, జడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఇందిరానగర్ సర్పంచ్ రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ మల్లిఖార్జున్, ఎంపీటీసీ హరితచారి, సెక్రటరీ నర్మద పాల్గొన్నారు.

వేమనపల్లి : మండంలోని నీల్వాయి గ్రామ పంచాయతీలో సర్పంచ్ గాలి మధు ఆధ్వర్యంలో పల్లె ప్రగతి దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గ్రామంలో ఫ్లెక్సీ ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ గాలి మధు జాతీయజెండాను ఆవిష్కరించి, జాతీయగీతాలపన అనంతరం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ రుద్రభట్ల సంతోష్ కుమార్ నూతన గ్రామ పంచాయతి భవనానికి ఉప సర్పంచ్, వార్డ్ మరియు కో ఆప్షన్ సభ్యులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నఫిజా బేగ్, పంచాయతీ రాజ్ ఇంజనీర్ పులి శ్రీధర్ పంచాయతి కార్యదర్శి జాఫర్ అలీ పాల్గొన్నారు.

కౌటాల : మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో పల్లె ప్రగతి దినోత్సవం



ఆసిఫాబాద్‌లో..

సందర్భంగా జెండా ఆవిష్కరించి ఘనంగా ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వాజ్జెల మౌనీష్ జెండా ఆవిష్కరించారు. మండలంలోని వీర్దండి ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ మడావి రేణుక విద్యార్థులకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో చల్లని నీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, తహసీల్దార్ సాయన్న, ఎంపీడీఓ నస్రుల్లాఖాన్, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు మెర్పెల్లి బ్రహ్మయ్య, ఏపీఓ పూర్ణిమ, ఏపీఎం వెంకటరమణ, ఉప సర్పంచ్ పర్చాకె బండు, కార్యదర్శులు సాయికృష్ణ, గణేష్ పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాలలో గ్రామపంచాయతీ భవనాలలో త్రివర్ణ జెండా పథకాన్ని ఆవిష్కరించరు. మండల కేంద్రంలో ఎంపీపీ డుబ్బులు నానయ్య, ఎంపీఓ సుధాకర్ రెడ్డిల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఐకేపీ, ఆశ కార్యర్తలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బందిని ఎంపిఓ సుధాకర్ రెడ్డి గ్రామ కార్యదర్శి ఆసిఫ్ అలీ శాలువతో సత్కరించి ప్రశంస పత్రం అందించారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ టోంబ్రే మారుతి, శ్రీనివాస్ రత్నం పాపయ్య పాల్గొన్నారు.

కోటపల్లి : తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న దశాబ్ద ఉత్సవాల్లో భాగంగా మండలంలోని జనగామ, ఆలుగామ, సూపక, గ్రామ పంచాయతీల్లో పల్లె ప్రగతి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనగామ సర్పంచ్ గట్టు లక్ష్మణ్‌గౌడ్, ఆలుగామ సర్పంచ్ కుమ్మరి సంతోష్, సూపకా సర్పంచ్ కాసెట్టి సతీష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పల్లెల్లో కాంతి వెలుగులు వెదజల్లుతున్నాయని అన్నారు. నాటి ప్రభుత్వ హాయంలో పల్లెలను పట్టించుకున్న నాధుడే లేడని తెలంగాణ ఏర్పడిన తర్వాత పల్లెలకు ప్రాధాన్యత కలుస్తూ గ్రామాలలో పరిశుద్ధ కార్యక్రమాలు, నర్సరీలు, స్మశానవాటికలు, ఇంటింటికి తాగునీరు, మరుగుదొడ్డి, డంపింగ్‌యార్డులను ఏర్పాటు చేసి పల్లె ప్రజల జీవన విధానాన్ని మార్చిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. ప్రతి గ్రామపంచాయతీకి పారిశుధ్య పనుల్లో భాగంగా ట్రాక్టర్‌ను ఇచ్చి గ్రామాలలోని తడి, పొడి చెత్త కోసం ఇంటింటికి డబ్బాలను మంజూరు చేసి మురికి వాడలను ప్రతినిత్యం శుభ్రం చేస్తూ దేశంలోనే తెలంగాణను ప్రథమ స్థానంలో నిలిపిన ఘనత కేసిఆర్‌కే దక్కిందన్నారు.



పెంచికల్‌పేట్‌లో..

భీమిని : తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పల్లె ప్రగతి దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఇన్‌ఛార్జి ఎంపీడీఓ గౌతమి, ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి, ఎంపీఓ శేఖ్ సఫ్దర్ అలీ ఏపీఓ భాస్కర్‌రావు భీమినిలో జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం పంచాయతీ కార్మికులను ఘనంగా సన్మానించారు. అదేవింగా మండలంలోని ఆయా గ్రామాల్లో పల్లె ప్రగతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బిట్టూర్ పల్లిలో సర్పంచ్ అధ్వర్యంలో మండల ప్రత్యేక అధికారి ఫణిందర్ జెండా ఆవిష్కరించిన ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పోతురాజుల గంగక్క వైస్ ఎంపీపీ చిలుముల మధు, సర్పంచ్ నాయకులు సుదర్శన్‌గౌడ్, ఇంజనీర్ రామచందర్‌రావు పాల్గొన్నారు.

పల్లె ప్రగతి ఉత్సవాల్లో నిలదీత

జన్నారం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దశాబ్దిఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న పల్లె ప్రగతి ఉత్సావాల్లో నిర్వహించిన గ్రామ సభలో కొందరు వార్డు సభ్యులు ఆందోలనకు దిగారు. నిర్వహణ సరిగా లేదని ఆ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు కడార్ల నరసయ్య, లతా శ్రీకాంత్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు శంకర్, లెక్కల మల్లయ్యతో గ్రామ ప్రజలతో పంచాయతీ ముందు ఆందోళన దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు మొదలు కావలసిన కార్యక్రమాలు, గ్రామసభ, సర్పంచ్ ఈఓ లేకపోవడంతో వచ్చిన ప్రజలకు సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. అధికారులు స్పందించి గ్రామసభ సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని



భీమినిలో..

తిమ్మాపూర్ గ్రామంలో సర్పంచ్ జాడి గంగాధర్ ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, వివిధ శాఖల ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను శాలువాలు కప్పి సన్మానించారు.

బెజ్జూర్ : పల్లె ప్రగతి దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొట్రంగి శారద ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రగతి నివేదికను కార్యదర్శి తుకారాం చదివి వినిపించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యదర్శి గ్రామ పంచాయతీలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు, మల్టీపర్పస్ వర్కర్లకు ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, ఉప సర్పంచ్ అడ్డూరి రాజేష్, ఐకేపీ సీసీ భద్రయ్య ఫీల్డ్ అసిస్టెంట్ దుర్గం రవి, తెలంగాణ జావిద్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : పల్లె ప్రగతి కార్యక్రమం గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముందు వార్డుసభ్యులు, గ్రామ పంచాయతీ వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి పల్లె ప్రగతిలో సాధించిన నివేదికను ఈఓ కృష్ణమూర్తి గ్రామస్తులకు చదివి వినిపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్‌అలీ, ఉప సర్పంచ్ తోట మహేష్, నాయబ్ తహసీల్దార్ మోబిన్, కోఆప్షన్ సభ్యుడు కిజర్ హుస్సేన్, వార్డుసభ్యులు ఇర్ఫత్ హుస్సేన్, సంతోష్, మోయిద్, కోఆప్షన్ సభ్యుడు ఆసిఫ్ హుస్సేన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్



నవతెలంగాణ-దహెగాం

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలో జీపు జాత వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్ రక్షణ కోసం, అంగన్‌వాడీ ఉద్యోగులకు 45వ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసు ప్రకారం కనీస వేతనం అమలుచేయాలని, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలుచేయాలని, ఇతర పెండింగ్ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆల్ ఇండియా అంగన్‌వాడీ యూనియన్ ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లాలో ఈ నెల 10వ తేదీ నుండి 16వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల సర్వే, ఈ నెల 20వ తేదీ నుండి స్థానిక సమస్యలపై ప్రాజెక్టు సీడీపీఓకు వినతిపత్రాలు ఇవ్వాలని, 16న ఆదిలాబాద్‌లో ప్రారంభమయ్యే జీపు జాత అన్ని జిల్లాల్లో ప్రాజెక్టులు తిరుగుతూ జీపు జాత పర్యటిస్తుందన్నారు. ఈ నెల 17న జాత జిల్లాకు వస్తున్నందున బహిరంగసభను ఆసిఫాబాద్‌లోని రోజ్ గార్డెన్ చెక్‌పోస్టు వద్ద నిర్వహించనున్నట్టు, పెద్దఎత్తున అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తమ సమస్యలను జీపు జాత దృష్టికి తీసుకురావాలన్నారు. జూలై 10వ తేదీన పెద్దఎత్తున కోరికల రోజుగా పాటించి 10 కిలోమీటర్లు పాదయాత్ర నల్ల చీరలతో బ్లాక్ డే నిర్వహించి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేసి కలెక్టరేట్‌లను ముట్టడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ వజ్రమ్మ, అంగన్‌వాడీ యూనియన్ జయప్రద, మల్లేశ్వరి, జ్యోతి, భాగ్య, గీత, మమత పాల్గొన్నారు.

మాలీ కులస్తులకు ఎస్టీ హోదా కల్పించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో ఆర్థికంగా సామాజికంగా అత్యంత వెనుకబడి ఉన్న మాలి కులస్తులకు ఎస్టీ హోదా కల్పించాలని మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లేండుగురే శ్యామ్ రావు డిమాండ్ చేశారు. గురువారం ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాలి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. పక్కన మహారాష్ట్రలో మాలీలు ఎస్టీలో ఉన్నారని అక్కడి నుండి వచ్చి ఏళ్ల తరబడి ఇక్కడ జీవిస్తున్న తమకు గుర్తింపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన కులంగా తాము ఉన్నామని అన్నారు. ముఖ్యమంత్రి ఈ విషయాన్ని గమనించి తమకు ఎస్టీ హోదా కల్పించాలని కోరారు. అలాగే ప్రస్తుతం బీసీ కులాలకు అందిస్తున్న ప్రోత్సాహం రూ.లక్ష తమ కులాన్ని కూడా చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాందేవ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

భారత రాజ్యాంగం ప్రకారం బలహీనవర్గంగా చెప్పబడే వయోవద్దులు అందరూ ఉన్న అనాధలుగా, బిడ్డల చేతిలోనే వేధింపులకు గురి అవుతున్నారని (టీబీఎస్ఎస్) తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అడ్వకేట్ రాజలింగు మోతె అన్నారు. గురువారం ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవం సందర్భంగా అడ్వకేట్ రాయలింగు మోతె మంచిర్యాలలోని ఎక్సైజ్ కోర్ట్ సమీపంలోని కార్యాలయంలో మాట్లాడారు. సమాజంలో సగానికి పైగా వృద్ధులు బిడ్డల, కొడుకుల చేతిలోనే వేధింపులకు గురవుతున్నారని అన్నారు. అందరూ ఉన్న సొంత ఇంట్లోనే బిక్కుబిక్కుమంటూ ఏ చీకటి మూలనో వృద్ధాశ్రమంలోనో శేష జీవితం గడుపుతుండడం చాలా విచారకరమన్నారు. ఇంట్లోనూ సమాజంలోనూ రకరకాలుగా వేధింపబడుతున్నారని, తిట్టడం, కొట్టడం, డబ్బుల కోసం వేధించడం, మాట్లాడకపోవడం, ఆహారం పెట్టకపోవడం, బాగోగులు చూడక పోవడం దూరంగా తీసుకెళ్లి వదిలివేయడం వంటివి చేస్తున్నారన్నారు. కొడుకు కోడలు పెట్టే బాధలను భరిస్తూ కాలం వెళ్ళదీస్తున్నారన్నారు. అనారోగ్య సమస్యలతో బాధ పడుతూ ఒంట్లో సత్తువలేక ఉపాధికి దూరమవుతున్నారని, దాంతో ఆదాయం కోల్పోయి పౌష్టికాహారానికి నోచుకోలేకపోతున్నారని, ఇలాంటి బాధలు తట్టుకోలేక వయోవృద్దులు బలవన్మరణాన్ని ఆశ్రయిస్తున్నారని తెలిపారు. వయోవృద్దుల సంరక్షణ చట్టం ప్రకారం 57 సంవత్సరాలు దాటిన వారిని సీనియర్ సిటిజన్‌గా ప్రభుత్వం గుర్తిస్తుందని, 2007 సంవత్సరంలో చేసిన సవరణ ప్రకారం కొడుకులు మాత్రమే కాకుండా కూతుళ్లు, అల్లుళ్లు కోడళ్లు, మైనారిటీ తీరిన మనుమలు, మనవరాళ్లు కూడా వారి బాధ్యతను స్వీకరించాల్సి ఉంటుందని అన్నారు. నివాసం,ఆహారం,దుస్తులు,మందుల ఖర్చులు భరించాల్సి ఉంటుందని, లేనిపక్షంలో రూ. 10000 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

అంతేకాకుండా వయోవృద్దుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే 6 నెలల నుండి గరిష్టంగా రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీఎస్ఎస్ నాయకులు శఠగోపం చిరంజీవి, మిరియాల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

అబ్దుల్ రషీద్‌ను వెంటనే అరెస్టు చేయాలి



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని డబ్బా గ్రామ సర్పంచ్ కుమారుడు అబ్దుల్ రషీద్ పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గొడం నగేష్ మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి డిమాండ్ చేశారు. గురువారం తుడుందెబ్బ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. డబ్బా గ్రామ సర్పంచ్ కుమారుడు రషీద్ ఆదివాసీ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించి, అక్రమ సంబందానికి ఒడిగడుతున్నాడని తెలిసి గ్రామస్తులు కట్టేసి చితకబాదిన ఘటన తెలిసిందే. ఈ విషయంలో ఆయనపై కేసు నమోదు చేసి కటినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు కుమ్ర శ్యామ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, మావల మండల అధ్యక్షులు ఆత్రం గణపతి, సీడం భీంరావు, కొడితే రాములు, అల్లం గంగారం, ఆత్రం సురేష్, కుమ్రం నారాయణ, పుష్పల, మల్లేష్ పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 16 జూన్ 2023

పద్మశాలి మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ ఉద్యమ భావాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లిన పద్మశాలి మహనీయులు జిల్లాకు చెందిన కొండ లక్ష్మణ్ బాపూజీ, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత సామల సదాశివ్ విగ్రహాలను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని పద్మశాలి సేవ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఆకాంక్షను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో వీరు ఇరువురి పాత్ర వెలకట్టలేనిదన్నారు. వారికి తగిన గుర్తింపు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రంలో ప్రతి ప్రాంతంలో వీరికి గుర్తింపు ఉందని తెలిపారు. జిల్లాకు చెందిన వీరి విగ్రహాలను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నూరి అశోక్, పట్టణ అధ్యక్షుడు బండి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు జంజరాల శ్రీనివాస్, జిల్లా కోశాధికారి దాసరి రాజు, టీఆర్ఎస్ నాయకులు దీపక్ ముండే, బీసీ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పాఠశాలల్లో చేస్తున్న కార్యక్రమాలకు గాను ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏటుకూరి శ్రీనివాస్‌రావు, ఆడె ప్రకాష్ ఒక ప్రకటనలో కోరారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతీ పాఠశాలను అలంకరించడం, జాతీయ జెండాను ఆవిష్కరించడం, స్వీట్ల పంపిణీ, సాంస్కృతిక పోటీలు, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించడం, పాఠశాల అభివృద్ధికి సహకరించిన గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులకు సన్మానం తదితర కార్యక్రమాలు చేపడుతున్నామని, వీటికయ్యే ఖర్చును ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలకు రూ. 5000, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ. 7,500, ఉన్నత పాఠశాలకు రూ. 10,000 చొప్పున అదనపు నిధులు మంజూరు చేయాలని వారు కోరారు.

పల్లెలన్నీ ప్రగతి సాధించాలి

- అదనపు కలెక్టర్ రాహుల్

నవతెలంగాణ-జైపూర్

గ్రామీణుల అవసరాల మేరకు ఏర్పడిన పల్లెలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం కానుకూరు గ్రామ పంచాయతీలో గ్రామస్తులతో కలిసి పల్లెప్రగతి దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పడిన గ్రామ పంచాయతీల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో ముదిగుంట గ్రామ పంచాయతీకి అనుబంధంగా ఉన్న కానుకూరు గ్రామ పంచాయతీగా ఏర్పడి ప్రగతిని సాధించుకుంటోందని సర్పంచ్ వెంకటేశ్వర్‌గౌడ్ చెప్పిన తీరును ఆయన గుర్తు చేశారు. దీనికి ముందు సర్పంచ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం గ్రామ ప్రజలతో కలిసి ఓడీఎఫ్ ప్లస్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మణ్, జెడ్పీటీసీ మేడి సునిత తిరుపతి, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ అనిల్‌కుమార్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. మండల పరిధిలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని గ్రామ పంచాయతీల వారీగా పల్లె ప్రగతి దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. గ్రామ పంచాయతి కార్యాలయాల్లో జాతీయ జెండాల ఆవిష్కరించడంతో పాటు స్థానికులైన గ్రామ పంచాయతీ పరిధిలో సేవలు అందిస్తున్న సిబ్బందిని శాలువాలతో సర్పంచులు సన్మానించారు.

భీమారం : మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు జాతీయ జెండాలు ఎగురువేశారు. అనంతరం పల్లె సీమల్లో జరిగిన అభివృద్ధిని వివరించారు. డంపింగ్ యార్డ్‌లు, పల్లె ప్రకృతి వనం, హరిత హారంతో పచ్చదనం మెరుగుపడిందన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పెంచికలపేట్ : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పల్లె ప్రగతి దినోత్సవాన్ని పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు, ర్యాలీలతో ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో సర్పంచ్‌లు పంచాయతీ ఆవరణలో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందిని శాలువాలతో సన్మానించి మెమొంటోలు అందజేశారు. మండలంలోని పోతెపెల్లి, అగర్‌గూడ, లోడ్‌పెల్లి గ్రామాల్లో ఎన్ఆర్ఈజీయస్ నిధులు రూ.60లక్షలతో మూడు గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాసింగ్, పంచాయతీ రాజ్ ఏఈ మగ్బుల్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుపతి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వార్డుసభ్యులు, అంగన్‌వాడీ, ఆశా, ఐకేపీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పల్లె ప్రగతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమగూడెం భరత్ కాలనీలో సర్పంచ్ ప్రమీలాగౌడ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి జెండా ఎగరవేశారు. అభివృద్ధి కరపత్రాలను విడుదల చేసి పంచాయతీ కార్మికులకు నూతన దుస్తులను అందించి ఘనంగా సన్మానించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల కళా ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, సర్పంచ్ ప్రమీలాగౌడ్, ఎంపీవో శ్రీనివాస్, ఎంపీటీసీ మల్లమ్మ, ఏపీఎం శ్యామల, రామకృష్ణ, జాడి ప్రమీలా, సల్మా, రాధ, రమా, వీవోఏ మహేశ్ పాల్గొన్నారు. సోమగూడెం(కే)లో సర్పంచ్ సపాట్ శంకర్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్ పాల్గొన్నారు. దేవాపూర్లో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, ఉప సర్పంచ్ కటకం రవీందర్, కార్యదర్శి కవిత, గడ్డం పురుషోత్తం, వడ్లూరి మల్లేశ్ పాల్గొన్నారు. ముత్యంపల్లిలో ఎంపీడీవో ఎంఏ అలీం, సర్పంచ్ ఆడె బాదు, ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, కార్యదర్శి మేఘన, మద్దిమాడలో ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, సర్పంచ్ ఆడె జంగు పాల్గొన్నారు.

సారంగాపూర్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామల్లో గురువారం తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పల్లె ప్రగతి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచులు జాతీయ జెండాలు ఆవిష్కరించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. పారిశుధ్య కార్మికులను శాలువాలతో సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు.


జైపూర్‌లో..

బేల : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గూడ గ్రామంలో గురువారం ఘనంగా పల్లెప్రగతి దినోత్సవాని జరుపుకున్నారు. ఈ కార్యక్రమనికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మండల ప్రజాప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ర్యాలీ చేపట్టారు. ముందుగా గ్రామ సర్పంచ్ ఠాక్రె జేబీతాయి జాతీయ జెండాను ఆవిష్కరించారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. పారిశుధ్య కార్మికులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వనిత ఠాక్రె, ఎంపిడిఓ మహేందర్, ఎంపిఓ సమీర్, బిఆర్ఎస్ నాయకులు ఠాక్రె గంభీర్, సతీష్ పవార్, కళ్లెం ప్రమోద్‌రెడ్డి, వాడ్కర్ తేజరావ్, పంచాయతీ కార్యదర్శి విఠల్ పాల్గొన్నారు.

తలమడుగు : మండల కేంద్ర గ్రామపంచాయతీ ఆవరణలో పల్లెప్రగతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కళ్లెం కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీఓ రమాకాంత్ మాట్లాడారు. ఇల్లుతో పాటు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచినట్లయితే ఆరోగ్యంగా ఉంటామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిన్న పెద్ద తేడా లేకుండా అన్ని గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు అందజేసిందన్నారు. అనంతరం గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులను, కారోబార్‌లను శాలువాతో సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గంగన్న, పంచాయతీ కార్యదర్శి అశోక్, బీఆర్ఎస్ నాయకులు సునీతరెడ్డి, రావుల నారాయణ, వీడీసీ చైర్మన్ రవి, ఉపాధ్యాయులు వినోద్‌రెడ్డి, వెంకటరమణ, అంగన్వాడి ఉపాధ్యాయురాలు మంజుల, రమణ, పద్మ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలో గ్రామ గ్రామాన స్వచ్ఛత దినోత్సవం నిర్వహించారు. పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. పారిశుధ్య వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. స్వరాష్ట్రం సాధించుకున్న తర్వాత ఎంతో అభివృద్ధి సాధించామని ఈ సందర్భంగా ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉల్వాజీ హైమావతి రాజు, ఎంపీడీఓ మోహన్, ఎంపీవో నసీరుద్దిన్, ఐకేపీ ఏపీఓ వాణిశ్రీ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వీడీసీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


భీమారంలో..


సారంగాపూర్‌లో..


తలమడుగులో..

సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సతీష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దహెగం మండలంలో ఉన్నటువంటి సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అధిక ధరలకు అమ్ముతున్నారని దానిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సతీష్ డిమాండ్ చేశారు. జిల్లా విద్యాధికారి అశోక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం కాకముందే విద్యార్థుల తల్లితండ్రులకు ఫోన్ చేసి పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు కొనాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని నిర్దేశించిన ధరల కంటే ఎక్కువగా డబ్బులు తీసుకుంటున్నారని అన్నారు. జిల్లాలో ప్రయివేట్ పాఠశాలలన్నీ ఇదే విధానాన్ని అవలంబిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల తల్లితండ్రుల నుంచి అధిక ఫీజ్‌లను తీసుకుంటూ నిలువు దోపిడీ చేస్తున్నారని, ఫీజులు కట్టలేని తల్లితండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. విద్యారంగ చట్టం విరుద్ధంగా పనిచేస్తున్న పాఠశాలపై, యాజమాన్యంపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమములో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జఫ్ఫార్, నాయకులు కిరణ్, సతీష్ పాల్గొన్నారు.

గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

అత్యధికసార్లు రక్తదానం చేసిన సందర్భంగా కాగజ్‌నగర్‌కు చెందిన పోతుల కళ్యాణ్ గురువారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నుండి కళ్యాణ్ ఈ ప్రశంసాపత్రం అందుకున్నాడు. కళ్యాణ్‌ను తెలంగాణ దళిత యువజన సంఘం అధ్యక్షులు ఈర్ల సునీల్‌కుమార్ అభినందించారు.

వ్యాయామశాల తెరిచే విధంగా చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి సింగరేణి ఏరియాలోని గోలేటి వ్యాయామశాలలో కోలిండియా స్థాయిలో రాణించిన పర్మినెంట్ కార్మికులను నియమించాలని హెచ్ఎంఎస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ పత్యం రాజాబాబు డిమాండ్ చేశారు. గురువారం బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోలేటి వ్యాయామశాలలో కోచ్ అందుబాటులో లేకపోవడంతో నిరుపయోగంగా ఉందన్నారు. వ్యాయామశాలను ప్రతిరోజు తెరిచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థిని అదృశ్యం

నవతెలంగాణ-కౌటాల



మండలకేంద్రంలోని నదీమాబాద్‌కు చెందిన విద్యార్థి కామ్రె శివానీ అదృశ్యమైనట్టు ఎస్సై ప్రవీన్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శివానీ సిర్పూర్(టి)లోని గురుకుల పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసుకొని టీసీ కోసం ఈ నెల 13న సిర్పూర్‌కు వెళ్లి తిరిగి రాలేదు. ఈ విషయంపై విద్యార్థిని తండ్రి గోవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదుచేసినట్టు ఎస్సై తెలిపారు.

విద్యార్థులు సామాజిక విలువలు కలిగి ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు సామాజిక విలువలు కలిగి ఉండాలని సరస్వతి శిశు మందిర్ పాఠశాల కమిటీ కార్యదర్శి వేణుగోపాల్, మంచిర్యాల కమిటీ కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన గాయత్రి యజ్ఞ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండి సామాజిక విలువలు కలిగి ఉండాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధిస్తున్న ప్రతి అంశాన్ని నిత్య జీవితంలో వర్తింపజేసుకోవడానికి ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు, పాఠశాల కమిటీ సభ్యులు కృష్ణమాచార్యులు, రాఘవగౌడ్, శైలేష్, కోట వెంకన్న, విశాల్ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రథమ పరీక్షల్లో 13 మంది డిబార్

- సీఎస్, డీఓల తొలగింపు?



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ప్రథమ పరీక్షలో గురువారం 13 మందిని ఇంటర్ బోర్డు అధికారులు డిబార్ చేశారు. గురువారం మ్యాథ్స్ 1బి, జువాలజీ, హిస్టరీ ప్రథమ సంవత్సరం పరీక్షలు నిర్వహించగా, ఈ కళాశాలలో 91 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం తొమ్మిది గంటలకు పరీక్ష ప్రారంభం కాగా దీనికి ముందే విద్యార్థులకు స్క్రీనింగ్ నిర్వహించి అధికారులు పరీక్షా కేంద్రంలోకి పంపించారు. కొద్ది సేపటిలోనే హైదరాబాద్ నుండి వచ్చిన ఇంటర్ బోర్డు బృందం సభ్యులు ఇద్దరు పరీక్షా కేంద్రంలోకి వచ్చి విద్యార్థులను తనిఖీ చేశారు. మొత్తం 13 మంది విద్యార్థుల వద్ద చీటీలు లభించగా వీరందరిని అధికారులు డిబార్ చేశారు. ఇందులో 12 మంది పురుషులు కాగా, ఒక మహిళ ఉంది. డిబార్ అయిన వారిలో మ్యాథ్స్ 1బి ఇంగ్లీషు మీడియం విద్యార్థులు ఇద్దరు, తెలుగుమీడియం తొమ్మిది మంది, జువాలజీ ఇద్దరు ఉన్నారు. కాగా ఒకే కళాశాలలో 13 మంది విద్యార్థులు డిబార్ కావడం పరీక్షా కేంద్రం నిర్వహణ లోపాన్ని బహిర్గతం చేస్తోంది. పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారి విధుల నిర్వహణ పట్ల విమర్శలు వ్యాపిస్తున్నాయి. పరీక్ష గదులలో ఇన్విజిలేటర్ల పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సీఎస్, డీఓల తొలగింపుకు నిర్ణయం?

ఈ పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారిని తొలగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. వీరి స్థానంలో కౌటాల, రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వర్తించే జూనియర్ లెక్చరర్‌లను నియమించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై డీఐఈఓ శ్రీధర్‌సుమన్‌ను సంప్రదించగా 13 మంది డిబార్ అయిన మాట వాస్తవమే అన్నారు. సీఎస్, డీఓల తొలగింపుపై ఎలాంటి ఉత్తర్వులు రాలేదని తెలిపారు.

జీపు జాతా పోస్టర్లు విడుదల



నవతెలంగాణ-సిర్పూర్(టి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల ప్రారంభం కానున్న జీపు జాత పోస్టర్లను సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి విడుదల చేశారు. గురువారం జీశాన్ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని, అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ చెల్లించాలని కోరుతూ ఈ నెల 17వ తేదీన కుమురంభీం జిల్లాలోని రాష్ట్ర జీపు జాత కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఐసీడీఎస్ రక్షణ కోసం ఉద్యోగులకు 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసు ప్రకారం కనీస వేతనం చెల్లించాలన్నారు. పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగభద్రత కల్పించాలని, ఇతర పెండింగ్ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేయాలని అన్నారు. ఈ సమస్యలపై దేశవ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేయాలని ఆలిండియా కమిటీ పిలుపునిచ్చిందని తెలిపారు. ఈ పిలుపులో భాగంగా జీపు జాత నిర్వహిస్తున్నట్టు, కార్యక్రమానికి ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అంగన్‌వాడీ హెల్పర్లు, మండల కోకన్వీనర్ ఉమాదేవి, అర్చన, మల్లేశ్వరి, నిర్మళ, లీల పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం సిబ్బందికి రవాణా సౌకర్యం కల్పించాలి



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి పని దినాల్లో సాయంత్రం విధులు ముగించుకొని వెళ్లే సమయంలో జీఎం కార్యాలయం నుండి నేషనల్ హైవే వద్ద గల గోలేటి క్రాస్‌రోడ్డు వరకు సింగరేణి ఆధ్వర్యంలో రవాణా సౌకర్యం కల్పించాలని టీబీజీకేయస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు కోరారు. గురువారం టీబీజీకేయస్ నాయకులు బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ జి.దేవేందర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో కౌన్సిలింగ్‌లో వివిధ ఏరియాల నుండి ఎక్కువ మంది మహిళలు గోలేటికి బదిలీపై రావడం జరిగిందన్నారు. కారుణ్య నియామకాల్లో తండ్రుల ఉద్యోగం చేస్తున్న మహిళలకు వారి తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. వారి తల్లిదండ్రులకు చెందిన సింగరేణి క్వార్టర్‌ను వీరికే కేటాయించడం జరిగిందన్నారు. వారు తప్పని పరిస్థితుల్లో శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి పట్టణాల నుండి విధులకు హాజరుకావాల్సి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని యాజమాన్యం మానవతా దృక్పథంతో ఆలోచించి రవాణా సౌకర్యం కల్పించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో టీబీజీకేయస్ 11 మెన్ కమిటీ మెంబర్ మంగీలాల్, జీఎం కమిటీ మెంబర్లు గజ్జెల్లి చంద్రశేఖర్, రవీందర్, మాన్కు సమ్మయ్య, మారిన వెంకటేశ్, జీఎం కార్యాలయం ఫిట్ కార్యదర్శి రవీందర్ పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

వికలాంగులకు చెల్లించే పెన్షన్‌ను రూ.3,016 నుండి రూ.4,016కు పెంచిన నేపథ్యంలో చైతన్య దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. ముందుగా సంఘం సభ్యులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాలాభిషేకం చేసి స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎండి ఖయ్యూం, సభ్యులు ఎ రవీందర్, మునీర్, నజీరా, సాహిల్, ప్రవీణ్, రమాకాంత్, షమీమ్ సుల్తానా పాల్గొన్నారు.

ఎస్సీ వసతిగృహంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్ రూరల్

జిల్లా కేంద్రంలోని ఎస్సీ ప్రభుత్వ బాలుర, బాలికల ప్రీ, పోస్ట్ మెట్రిక్ కళాశాల వసతి గృహంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతి గృహ సంక్షేమ అధికారులు సంజీవ్, భాగ్యరాణిలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రీ మెట్రిక్ బాలుర వసతి గృహంలో 60 సీట్లు, పోస్టుమెట్రిక్ బాలురవసతి గృహాల 93 సీట్లు, ప్రీ మెట్రిక్ బాలికల వసతి గృహంలో 60 సీట్లు, పోస్టుమెట్రిక్ బాలికల వసతి గృహంలో 100 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఇతర వివరాల కోసం (బాలుర) 9441170044 (బాలికల) 6302989495 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.